కొత్త కలాలు

# సాయం కోసం

## వెర్రిబాబు

గవురవ నీయులయిన టువంటి ప్రెధాన మంత్రి గారికి నేను నమస్కరించి రాయుచున్నది.

నేను అయిదో తరగతి పేసయ్యాను. పేసయ్యిన రోజున మా హెడ్డుమాష్టారు నన్ను కేకేసి ఒరేయ్ శీనూ నీకు స్కూలు ఫష్టువచ్చిందిరా బాగా చదువుకో పెద్దోడివయ్యాకా బాగుపడతావ్' అని చెప్పి ఒక మంచి పెన్ను ఇచ్చారు నాకు. నాకు బలే సంతోసమేసింది. ఆయన చాలా మంచోరు నన్నెప్పుడూ కొట్టేవారుకాదు. ఆయన బట్టీ పట్టమన్న పాఠాలు కచ్చితంగా బట్టీగా చదివి అప్పగించేవాన్ని. ఆయన చెప్పిన పనల్లా చేసే వాన్ని. అంచేత నేనంటే ఆయనకు మంచి ఇష్టం. మాస్టారు పెన్ను యిచ్చారని చెప్పి, అయి స్కూల్లో రేపే చేరిపించమనిచెప్పాను మానాన్నతో మాటలాడలేదు. సంతోసంగా బయటకెళ్ళిపోయాను నేను.

తరవాత రోజున "ఒరేయ్ శీనూరారా' అని కేకేసాడు మా నాన్న. ఉతికిన బట్ట లేసుకుని మా నాన్నతూడా వెల్లాను. సావుకారు కొట్టుదగ్గర కెళ్ళాడు మానాన్న పుస్తకాలు కొంటాని కనుకొని 'అప్పుదే పుస్తకాలెందుకు స్కూల్లో చేరాకా మాస్టారు చెప్పిన పుస్తకాలు కొనుక్కోచ్చు' అన్నాను. మా నాన్న నాకేసి అదోలా చూసాడు నావంక 'ఇయ్యాల్టి నుంచి నువు యీ కొట్లోనే పనిచెయ్యాలి, రోజూ వచ్చి సావుకారు చెప్పిన పనల్లా చెయ్యాలి అర్ధమైందా?' అన్నారు మా నాన్న-గుండాగినంత పనయ్యింది నాకు. 'అయితే అయిస్కూల్లో చేర్పించవా?' అన్నాను. 'మనలాంటోళ్ళకి చదువులెందుకురా? చిన్నప్పట్నించీ నేర్చుకుంటే పెద్దోడివయ్యాక బాగుపడతావ్, ఆయన చెప్పినట్టల్లా చెయ్యి, మావోడికి రెండు జంతికలివ్వండి సావుకారుగారూ' అని చెప్పి వెళ్ళిపోయాడు మానాన్న నాకు ఏడుపొచ్చింది ఏం చెయ్యను?

ఇంటికొచ్చాక మా అమ్మదగ్గర ఏడుపు మొదలెట్టా. మా నాన్న వచ్చాక నన్ను చదివించమని చెప్పింది మా అమ్మ. 'నా కొచ్చే జీతంతో మిమ్మల్నే పోషించలేక పోతున్నాను. మళ్ళీ వీడి పుస్తకాలకి, ఫీజులకి. ఎక్కడి నుంచి తేను?'అన్నాడు మా నాన్న. అన్నట్టు రాయటం మర్చిపోయాను. మా నాన్న మా వూరి గ్రామ

నౌకరుగా పనిచేస్తున్నాడు. ఆయనజీతం చాలా తక్కువట. మానాన్న అప్పు డప్పుడు అంటాడు, "నాకన్నా కూలోడికి ఎక్కువ జీతమొస్తది" అని. నేను చదివించమంటూ మంకుపట్టు పట్టాను. మా నాన్న కోపంగా రెండు దెబ్బలేసి 'ఛీ మధ్య తరగతోడు కుటుంబంలో చచ్చినా పుట్టకూడదు'. అంటూ రోడ్డు మీద కెళ్ళి పోయాడు.

మరునాడు సావుకారు కొట్టుదగ్గర కెళ్ళి పనిలో చేరాను. చెప్పిన సరుకల్లా తెచ్చి అందిస్తున్నాను. నిన్న బెల్లం అందివ్వ మన్నాడు. బెల్లాన్ని చూసేటప్పటికి నా నోరూరింది. రోజూ మా అమ్మ బడికెళ్లేటప్పుడు చిన్న ముక్క పెట్టేది, చిన్నముక్క విరిసి నోట్లో పెట్టుకున్నానో లేదో అప్పుడే మా సావుకారు రావటం, నా వీపుమీద నాలుగొడ్డించటం జరిగి పోయాయి. 'పత్రాముల్ని ప్రతి సరుకూ ఇలాతింటూ కూర్చుంటే నాయిల్లుగుల్లయి కూర్చుంటది' అంటూ వెళ్ళిపోయాడు. ఏడుస్తూ ఇంటి కెళ్ళి చెప్పాను.' నిన్ను కొట్లో పెట్టింది బెల్లం తింటానికి కాదు, జీతానికి' అంటూ మా బాబయ్య మళ్ళీ నాలుగొడ్డించాడు;

ఇయ్యాల పొద్దున్న మా షావుకారు ఏవో సరుకులు పట్రామన్నాడు. సరుకులు పట్టుకుని పరధ్యానంగా వెళుతున్నాను నాకాలు తగిలి నూనెడబ్బాలో కొద్ది గా వున్న నూనె కాస్తా ఒలికిపోయింది. అంతే నా వీపుమీద వరుసగా దెబ్బలు పడుతున్నాయి. మా సావుకారు కొడుకు రాంబాబు వచ్చి నన్ను లోపలికి లాక్కెళ్ళి పోయాడు.

'ఏడుస్తావెందుకు? కొట్లో పని చెయ్యటం నీకిష్టంలేదా?' అన్నాడు.లేదని తలూపాను.

"మరేం చెయ్యాలనుంది?"

"చదువు కోవాలని"

"మరేం?"

"మా నాన్న చదివించ లేనన్నాడు."

"అయితే ఒక పనిచెయ్యి నన్ను చదివించమంటూ ప్రధాన మంత్రిగారికో లెటరు రాయి."

అర్థం కాక అతనివైపు చూసాను.

"నువ్వు స్కూలు మానేసినప్పటి నుంచి యిప్పటి వరకూ జరిగినదంతా ఒక తెల్లకాగితము మీద రాసి "నన్ను చదివించే ఏర్పాటు చేయండి" అని రాసి ఈ కవరులో పెట్టి పోస్టు బాక్సులో పడెయ్యి" అంటూ లోపలికెళ్ళి ఒక పొడుగుపాటి కవరుతెచ్చి దాని మీద ఇంగ్లీషులో ఏదోరాసారు. 'అలాగే' అంటూ తలూపాను నేను, అదో లా నవ్వుతూ వెళ్ళిపోయాడు రాంబాబు.

ఇంటికొచ్చి మా మాస్టారు ఇచ్చిన పెన్నుతో ఈ ఉత్తరం రాస న్నాను. ఈ ఉత్తరం అందినవెంటనే మీరు నన్ను చదివించే ఏర్పాటు చెయ్యండి. చేస్తారను కొంటున్నాను. మీరు నన్ను చదివించ లేనట్టయితే నేను చదువుకోకుండా ఇలా సావుకారుదగ్గర పనిచెయ్యటానికి కారణ మెవరో రాయండి. అతనికి వెంటనేనన్ను చదివించమంటూ ఉత్తరం రాసాను. ఇందులో బోలెడన్ని తప్పులుండొచ్చు. ఉంటాయి. ఎక్కువ తప్పులుండ వను కుంటాను. మా మాస్టారు నా రాతచూసి 'అస్సలు తప్పులు లేకుండా బలేరాస్తావురా

# కృషీవలుణ్ని నేను!

ఖ్రమొద్దీన్

వృబుసుపోక
కలం పట్టిన
వృత్తి కవినని
తెల్లకాగితానికి
నేనంటే అలుసు....!
కానీ—.
నిజానికి నేను
"వృత్తి" కవిని కాను!—
ఇన్ని కిరణాలు ధారపోసి,
ఏ గుర్తింపులేని చంద్రుడికి
ఓ గుర్తింపూను సాధించి పెట్టిన
సూర్యుడికి మల్లె
దస్తాలకు దస్తాల అడుగున
అణగారిపోతూ
తెల్లగా పాలిపోయిన
తెల్లకాగితాన్ని పైకితీసి,
చల్లచల్లగా కథలూ కవితలూ రాసి
బ్రతుకు పండించే
కృషీవలుణ్ని!

# మూసీనదిలో

దేవి

కాలే కడుపులూ
మండే గుండెలూ
పెట్టుకున్న మెమొరాండం
మూసీ నదిలో ముక్కు మూసుకుంది!
కూడూ గుడ్డా
యివ్వలేని అధికారం
అన్ని కలల్నీ తుదముట్టిస్తుంది!!
పనీ పాటా
కల్పించలేని ప్రభుత
ఎన్నికలలో కలవరిస్తుంది!!!

# అందని బస్సు

వసీరా

చాలాకాలంనుంచి పరుగెడుతున్నాను
కాలం కంకర రోడ్డుమీద
బ్రిటిష్ విద్యావిధానం బస్సు వెనకాల
అది నా కంట్లోనూ నోట్లోనూ
దుమ్ముకొడుతూ పోతోంది

---

నువ్వు, పులుస్టాపులు, కామాలు కూడా చాలా కరెక్టుగా పెడతావు. రాతకూడా చాలా అందంగా ఉంటుంది' అంటూ అశెండెన్సు రిజిస్టరులు నాచేతే రాయించే వాడు. తప్పులుంటే ఏమీ అనుకోకండి మరి నమస్కారం.

మీ సాయం కోసం ఎదురు చూస్తూ—
శీనుబాబు.

* * *

స్టాంపులు అంటించకుండా, ఫ్రమ్ అడ్రస్ లేకుండా, గమ్మత్తయిన ఎడ్రసుతో వచ్చిన ఈ కవరును తప్పు అని తెలిసినా, ఆతృతను చంపుకోలేక చింపేను నేను. ఎడ్రసు మళ్ళీ ఒకసారి చదవటం మొదలెట్టాను.

"టూ,
ప్రైమ్ మినిస్టర్,
ఢిల్లీ.

స్టాంపులంటించి పంపితేనో అని నాను? పోస్టుమాస్టర్ గిజగిజ లాడాడు.

ఆ కుదురైన అక్షరాల వెనక కొట్ల మంది బాల బాలికలు కదిలిపోతున్నట్టని పించింది.

నీళ్ళుబికిన నా కళ్ళకి.